
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 నవంబర్ 2025
5
అన్నమయ్య



ప్రభుత్వాస్పత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు వితరణ


డాక్టర్‌కు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందిస్తున్న చింతల

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం పట్టణంలోని శ్రీ సాయి నారాయణ సేవా ట్రస్టు అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి రెండు ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను వితరణగా అందించారు. గురువారం స్థానిక మెడికల్ ఆఫీసర్ మాలతికి ఆయన అందించి, నిరుపేదల వైద్యం కోసం ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాలతి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నిరుపేదల ఆరోగ్యం కోసం ఉపయోగించేందుకు కాన్సంట్రేటర్లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, సిబ్బంది సుధాకర్, నాయకులు చింతల ఆనందరెడ్డి, నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

- విఆర్ఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిట్వేలి

విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయకపోతే ఉద్యమిస్తామని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొరముట్ల సుధాకర్ హెచ్చరించారు. విఆర్ఎ, గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్నా విఆర్ఎల సమస్య ఏ ఒక్కటి కూడా పరిష్కారం చేయలేదన్నారు. విఆర్ఎలకు 8 సంవత్సరాలుగా జీతాలు పెరగలేదన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు గాని విఆర్ఎల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. విఆర్ఎలతో అక్రమ డ్యూటీలు చేయిస్తున్నారని, చాలీ చాలని జీతం ఇస్తూ బందకారికి చేయిస్తున్నారని, విఆర్ఎలు శ్రమ దోపిడికి గురవుతున్నారని, పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో విఆర్ఎలకు పేస్కేలు అమలు చేసి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మన రాష్ట్రంలో కూడా విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలని మంత్రులు, అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదన్నారు. చదువుకున్న విఆర్ఎ ఎప్పటికైనా విఆర్ఓలుగా ఉద్యోగోన్నతి పొందుతారని ఆశగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రమోషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా కనిపిస్తున్న వారిని విఆర్ఎలుగా గుర్తించడం లేదన్నారు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న విఆర్ఎలకు వయోభారం పెరుగుతుందన్నారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన విఆర్ఎలను ఆకలి బాధల నుండి ప్రభుత్వం ఆదుకోవాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విఆర్ఎలకు పేస్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్‌మెన్ ప్రమోషన్ శాతాన్ని 70 శాతం పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీస వేతనం రూ.18 వేలు ఇస్తానని ఎన్నికల్లో చెప్పి ఒక రూపాయి పెంచకపోగా రికవరీ పేరుతో సాధించుకున్న డిఎ రూ.300 రికవరీ చేశారన్నారు. ఎన్నికల్లో విఆర్ఎలు వేతనాలు పెంచుతామన్నా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వేతనాలు పెంచలేదన్నారు. తెలంగాణలో పేస్కేల్ అమలు చేయడంతో వీఆర్‌ఏలకు దాదాపు రూ.20 వేలు పైగా వేతనాల అమలు అవుతున్నాయన్నారు. వేతనాలు పెంచకుండా ఖాళీలు భర్తీ చేయకుండా విఆర్ఎలతో నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు, అటెండర్ డ్యూటీలు, డ్రైవింగ్ డ్యూటీలు, అక్రమంగా చేయిస్తు న్నారన్నారు. వాటిని తక్షణం రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటలను రద్దుచేసి పెత్తందారులకు అనుకూలంగా 12 గంటలకు పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 10 గంటలకు పెంచిందన్నారు. పని గంటల పెంపుకు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. విఆర్ఎలు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గ్రామ సేవకుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నది సిఐటియు మాత్రమేనని, పోరాడే సంఘాన్ని బలపరిచి తమహక్కులను సాధించు కోవాలని పిలుపునిచ్చారు. రాజంపేట డివిజన్‌లో కూడా ప్రమోషన్లు ఇవ్వాలని గతంలో సబ్ కలెక్టర్ ఇచ్చిన హామీ ఇంకా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పండిశెట్టి మణి, మండల విఆర్ఎ సంఘం మల్లారపు గురయ్య, విఆర్ఎల సంఘం మండల నాయకులు బి.సుబ్బరాయుడు, సంగటి, శంకరు, జె.రమణ, జి.నరేష్, మదన్‌మోహన్, రామయ్య, పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

పెరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి వ్యయం

- పిఎసి చైర్మన్ కూన రవికుమార్


ఆర్‌టిపిపి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పిఎసి చైర్మన్, సభ్యులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపిలో విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోందని ఆంధ్ర ప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ (పిఎసి) చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. గురువారం పిఎసి చైర్మన్ రవికుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ నగమునెయ్య, సభ్యులు జిల్లా ఎమ్మెల్యే రంగారావు, తెనాలి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమారరాజా, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్‌టిపిపి సందర్శించారు. అనంతరం డాక్టర్ ఎంవిఆర్ రాయలసీమ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఆర్‌టిపిపి) కాన్ఫరెన్స్ హాలులో పిఎసి చైర్మన్ రవికుమార్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. 1999లో 3400 ఎకరాల్లో ఏర్పాటైన ఆర్‌టిపిపి ప్రధానంగా వాణిజ్య వ్యవసాయ అవసరాలకు సంస్థల స్థాయిలో విద్యుత్ అవసరాలను పూరించే నిమిత్తం ఏపి జెన్‌కో సంస్థ నిర్వహణలో అత్యంత ప్రసిద్ధి గాంచిన విద్యుత్ ఉత్పత్తి సంస్థగా పేరుగాంచిందని కమిటీకి అధికారులు వివరించారు. ఆర్‌టిపిపిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం నాటి నుండి ఇప్పటివరకు నిర్వహణ, ఉత్పత్తి సామర్థ్యం, సాంకేతిక పురోగతి, ఎదురైన సవాళ్లు, సమస్యలు తదితర అన్ని అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీ తెలుసుకుంది. ఆర్‌టిపిపిలో మ్యాన్ పవర్, కెపాసిటీ, ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలు, ఖాళీ పోస్టుల వివరాలు, క్యాడర్ స్ట్రెన్త్, ఏపి ప్రాతిపదికన నియామకాలు జరిగాయి, రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా జరిగిన నియామకాల వివరాలను అడిగి కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. సంస్థలో విధులు నిర్వర్తించే ఉన్నతాధికారులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఉద్యోగ ధర్మంతో పాటు, సామాజిక బాధ్యతను మరువకుండా సంస్థ పురోభివృద్ధి కోసం పాటుపడాలే తప్ప అలసత్వానికి తావివ్వకూడదని కమిటీ చైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో చాలా అధునాతనంగా నిర్మించారని తెలిపారు. ఇందులో బాయిలర్లు చాలా పటిష్టంగా నిర్మించారన్నారు. ఈ స్థాయిలో బొగ్గు మనకు లభించడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని తాడిచెరువు కోల్‌మైన్స్ నుంచి, తెలంగాణలోని సింగరేణి కోల్‌మైన్స్ నుంచి బొగ్గు ఆర్‌టిపిపికి వస్తుందని తెలిపారు. ఈ బొగ్గు అనుకున్నంత నాణ్యతగా లేదని వివరించారు. విద్యుత్ ఉత్పత్తి ఖర్చు పెరుగుతోందని వివరించారు. ఈ నివేదికను అసెంబ్లీ ద్వారా ప్రభుత్వానికి ఇస్తామన్నారు. ప్రభుత్వం పరిశీలించి ఉత్పత్తి ఖర్చు తగ్గించేందుకు నిర్ణయాలు తీసుకుంటుందని వివరించారు. ఆర్‌టిపిపిలో రెండు రకాల ఫ్లైయాష్ వస్తుందని తెలిపారు. ఒక రకం ఫ్లైయాష్ సిమెంట్ పరిశ్రమలకు, ఇటుకల పరిశ్రమలకు వెళుతోందని తెలిపారు. ఇంకో రకం యాష్ పాండులో 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ఫ్లయాష్ నిల్వ ఉండిపోయిందని తెలిపారు. ఇది పరిశ్రమలకు తరంగాదని కేవలం గుంతలు పూడ్చేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. కొన్ని సందర్భాలలో ఇసుక బదులుగా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఇది అవసరం ఉన్నవారు ఉపయోగించుకోవాలన్నారు. అసెంబ్లీలో ఉన్న ఫైనాన్స్ కమిటీలో భాగంగా కమిటీ పబ్లిక్ అండ్ రిలేషన్స్ ఆధ్వర్యంలో మొదటిసారి ఆర్‌టిపిపి సందర్శించినట్లు తెలిపారు. జెన్‌కో కార్పొరేషన్‌లో ఉన్న యూనిట్లలో ఆర్‌టిపిపి ఒక ఇండివిజువల్ యూనిట్ అని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌టిపిపిలో 600 మెగావాట్ల యూనిట్‌ను, కోల్ ప్లాంటును, బాయిలర్స్‌ను పరిశీలించారు. మొదటగా మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఆర్‌టిపిపిలో శంకుస్థాపన చేసిన చోటుని పరిశీలించారు. అక్కడ క్లీన్ చేయించాలని నీట్‌గా ఉంచాలని అధికారులకు సూచించారు. సిఇ కార్యాలయంలో స్థానిక ఎపి జెన్‌కో అధికారులతో, స్థానిక సిబ్బందితో సమావేశం నిర్వహించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆర్‌టిపిపి అధికారులు కమిటీ చైర్మన్, సభ్యులకు దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టిపిపి డైరెక్టర్ పి.అశోక్ కుమార్‌రెడ్డి, సిఇ జి.ఎం.వాసుదేవరావు, ఎస్ఇ సోమశేఖర్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.సిద్దయ్య, ఇఇ గురునాథ్, తహశీల్దార్ శోభన్‌బాబు, ఆర్‌టిపిపి సంబంధిత ప్లాంట్ల ఎస్ఇలు, డిఇలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్‌టిపిపి ఉద్యోగులు వారి సమస్యలను విన్నవిస్తూ వినతులనుఅందజేయగా అందికు సంబంధించి వివరణ ఇవ్వాలని యాజమాన్యానికి కమిటీ చైర్మన్ సూచించారు.

'మిట్స్'ను సందర్శించిన అమెరికా ప్రతినిధులు



ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ విశ్వవిద్యాలయం ఉన్నత ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నీ కె.రోజర్స్, అడ్వకేట్ డాక్టర్ సాండ్రా ఎర్ల్, ప్రోవోస్టు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి క్రోవి, వైస్ ప్రోవోస్టు ఫర్ అకడమిక్ అఫైర్స్ డాక్టర్ రామ్ వీరపనేని, డాక్టర్ వాయిల్ మోక్తర్ ఈ బృందంలో ఉన్నారని వైస్ ఛాన్స్లర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నీ కె.రోజర్స్ మాట్లాడుతూ బౌలింగ్ గ్రీన్ విశ్వవిద్యాలయం 100 ఏళ్లకు పైగా ఉన్న విద్యా సంస్థగా ప్రపంచ వ్యాప్తంగా 2 లక్షలకుపైగా పూర్వవిద్యార్థులను కలిగి ఉందని తెలిపారు. ఎనిమిది కళాశాలల ద్వారా 200 కంటే ఎక్కువ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, మాస్టర్స్ నుంచి పిహెచ్‌డి వరకు 75 గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నామని పేర్కొన్నారు. మిట్స్ యూనివర్సిటీని సందర్శించడం హర్షించదగ్గ విషయమని, ఇక్కడి విద్యార్థుల టెక్నాలజీ, పరిశోధన అవకాశాల అభివృద్ధికి తమ విశ్వవిద్యాలయం సహకారం అందిస్తుందని తెలిపారు. మిట్స్ ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ నాదెళ్ల విజయ భాస్కర్ చౌదరి మాట్లాడుతూ బౌలింగ్ గ్రీన్ యూనివర్సిటీ ముఖ్యంగా ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్ రంగాల్లో విశేష నైపుణ్యం కలిగి ఉండటం, మిట్స్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నేర్చుకునేందుకు ఇది గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశం, దక్షిణాసియా ప్రాంతాలు ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ ప్రయాణ విస్తరణలో వేగంగా ఎదుగుతున్న నేపథ్యంలో రెండు దేశాల మధ్య విద్యా, సాంకేతిక సహకారం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్శనలో భాగంగా మిట్స్ యూనివర్సిటీ, బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందంపై మిట్స్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, బౌలింగ్ గ్రీన్ ప్రెసిడెంట్ డాక్టర్ రోడ్నీ కె.రోజర్స్ సంతకాలు చేశారు. విద్యార్థుల కోసం ఇంటర్న్‌షిప్‌లు, అంతర్జాతీయ పరిశోధన కార్యక్రమాలు, గ్లోబల్ ఇమ్మర్షన్ కార్యక్రమాలు, స్టూడెంట్ ఎక్స్చేంజ్, ఎంఎస్ వంటి ఉన్నత విద్యా అవకాశాలను అభివృద్ధి చేయడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ హెడ్ వేణు చౌదరి, డీన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ శ్రీమంత్ బసు, సీనియర్ మేనేజర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ యు.విజయలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రమ్మను హత్య చేసిన వారిని శిక్షించాలి

- ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ


సావిత్రమ్మ హత్యపై స్థానికులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని సిటిఎం క్రాస్ రోడ్డులో కళాకారిణి సావిత్రమ్మను దారుణంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, మదనపల్లె కార్యదర్శి రెడ్డిప్రసన్న డిమాండ్ చేసారు. సావిత్రమ్మ నివాసమున్న ప్రాంతంలో ఐద్వా బృందం గురువారం పర్యటించి విచారించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ, రెడ్డిప్రసన్న మాట్లాడుతూ హతురాలు వీధి నాటకాలు వేస్తు జీవనం కొనసాగించేదని పేర్కొన్నారు. మిగిలిన సమయంలో కూలి పనులు చేసుకొనేదని పేర్కొన్నారు. హత్య జరిగిన రాత్రి సావిత్రమ్మ సచివాలయం వెనుకకు బహిర్భూమికి వెళ్ళగా ఆమె అలవాటుగా వేసుకున్న టవల్‌నే మెడకు చుట్టి హత్య చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోనే మద్యం దుకాణం ఉందని చెప్పారు. అక్కడ మద్యం సేవించి ఎవరో మత్తులో ఈ హత్య చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నట్లు విచారణలో తెలిసిందని పేర్కొన్నారు. ఆమెకు కుమారుడు, కోడలు ఉన్నారని తెలిపారు. కుమారుడు డ్రైవింగ్ చేస్తుంటాడని తెలిపారు. ఇటీవల కుమారుడు ఆదిత్య కొన్న పల్సర్ బైక్ విషయంలో తల్లీకొడుకులకు మధ్య వివాదం ఏర్పడిందని కూడా తెలిసిందని పేర్కొన్నారు. ఈ సంఘటనపై పోలీసులు త్వరగా విచారణ చేసి హంతకులు ఎంతటి వారైనా అరెస్టు చేసి సావిత్రమ్మకు తగు న్యాయం చేయాలని కోరారు. అక్కడఉన్న మద్యం దుకాణం వల్ల పలు అనర్థాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మద్యం మత్తులో కొందరు నేరాలు చేస్తూ మహిళలని ఇబ్బందులు పెడుతుండడం దృష్ట్యా మద్యం దుకాణాన్ని మూసివేసి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.


క్రీడాకారులతో యుటిఎఫ్ నాయకులు

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట

జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో ఆటల పోటీలలో హెచ్.చెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో జరిగే ఖో-ఖో పోటీలకు ఎన్నిక కావడం జరిగిందని, వారిని అభినందిస్తూ యు టీ ఎఫ్ రాజంపేట మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులను అందజేయడం జరిగిందని యు టీ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెంగల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర క్రీడలకు ఎన్నిక కావడం చాలా అభినందించదగిన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట సుబ్బయ్య, మండల అధ్యక్షుడు నాగేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, పి.డి ఈశ్వర్ నాయక్, ఉపాధ్యాయులు సూర్యారావు, ప్రశాంత్, చిన్న గంగయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పేర్కొన్నారు. పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యా శాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు బాలల హక్కుల్లో ఒక భాగమేనని తెలిపారు. మీకున్న హక్కులను చక్కగా సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రముఖ మోటివేషన్ స్పెషలిస్ట్ రామ్మూర్తి మాట్లాడుతూ బాల్యంలో శిక్షణ, యవ్వనంలో క్రమశిక్షణ, వృద్ధాప్యంలో సంరక్షణ అనేవి జీవితంలో చాలా ముఖ్యమైనవని పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న సమాజంలో అనేక సమస్యలు, సవాళ్లు మనకు ఎదురౌతుంటాయని తెలిపారు. వాటిని అధిగమించి, మీ లక్ష్యాలు చేరుకునే వరకు మీ ప్రయత్నం కొనసాగాలని తెలిపారు. సభాధ్యక్షులు జల్లా లలితమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ఐక్యరాజ్యసమితిలో జరిగిన తీర్మానంలో అప్పటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు భారతదేశం కూడా బాధ్యత వహిస్తుందని బాలల రక్షణ పరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో జరిగిన తీర్మానంలో సంతకం చేయడం జరిగిందని, బాలలుగా మీకున్న హక్కులను సంపూర్ణంగా వినియోగించుకొని మీ లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఉత్తన్న, ఫోర్డ్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నిర్మల, ఎంఐఎస్ సుభాషిని, జయలక్ష్మి, స్వర్ణకుమారి, జలజ, అల్తాఫ్, నరసింహ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

- వ్య.కా.స జిల్లా నాయకులు సుధీర్ కుమార్


మాట్లాడుతున్న సుధీర్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములకు రక్షణ కవచంగా ఉండే అసైన్డ్ చట్టాన్ని ప్రభుత్వం పరిరక్షించాల్సింది పోయి సవరించి వారికి దూరం చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్ పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా ప్రభుత్వాలు నిరుపేదలకు లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను మంజూరు చేసిందని తెలిపారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా అమ్మడానికి, కొనడానికి వీలు లేకుండా 9/77 అసైన్డ్ చట్టాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ చట్టం పేదల భూములకు రక్షణ కవచంగా ఉంటూ వస్తుందని, గత వైసిపి ప్రభుత్వం చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసి విఫలం చెందిందని తెలిపారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అప్పట్లో వైసిపి చర్యలను తప్పుబట్టి నేడు అసైన్డ్ భూముల రక్షణ కవచంగా ఉన్న అసైన్డ్ చట్టాన్ని చట్ట సవరణ చేసి పేదల వద్ద నుండి భూములు అతి సునాసాయంగా కోల్పోయే విధంగా వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10న జరిగిన క్యాబినెట్ సమావేశంలో చేసిన అసైన్డ్ చట్ట సవరణను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీని కోసం ఈనెల 22న శనివారం రాయచోటిలోని స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు మేధావులు అభ్యుదయవాదులు అసైన్డ్ భూములు పొందిన పేదలు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయవలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి సుధాకర్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: ఎపిఎస్‌ఆర్‌టిలో వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అన్నమయ్య జిల్లా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీరిస్తున్నామని ఎపిఎస్‌ఆర్‌టిసి కర్నూల్ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ ఉత్తీర్ణత సాధించి ఆన్‌లైన్ డీజిల్, మోటర్ మెకానిక్, ఎలక్ట్రిషన్, వెల్డర్, పెయింటర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కర్నూల్ లోని జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి వికలాంగులు, మాజీ సైనిక ఉద్యోగ పిల్లలు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్, ఒక సెట్ జిరాక్స్ కాపీ తీసుకురావాలన్నారు. డిసెంబర్ 3న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హాజరుకావాలని కోరారు.

22న ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రాజంపేట

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా రాజంపేట పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ బాలరాజు ఈ నెల 22వ తేదీన పట్టణ కేంద్రంలో ఉన్న తిరుమల కన్వెన్సన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు రాజంపేట ఐఎంఎ అసోసియేషన్ సీనియర్ వైద్యులు డాక్టర్ సుధాకర్, చెన్నయ్య తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాలరాజు ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రముఖ వైద్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు వైద్యులకు వైజ్ఞానిక సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఐఎంఎ వైద్యులు వీరయ్య, విజయ్ కుమార్, శ్రీహరి, సునీల్, అనిల్, మధుసూదన్ రెడ్డి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బాస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) 14 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేద్కర్ ప్రాంగణం వద్ద ఘనంగా ప్రారంభించారు. బాస్ జాతీయ కన్వీనర్ పిటిఎం శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఉలగనాధన్ గణపతితో కలిసి బాస్ జెండాను ఎగురవేసి, వేడుకలు ప్రారంభించారు. అనంతరం బాస్ శ్రేణులు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ మహాశయుడు స్వప్నించిన కుల నిర్మూలన-స్టేట్ సోషలిజం సాధించడానికి, బౌద్ధ సాంస్కృతిక జీవనం-రాజ్యాధికారం లక్ష్యంగా, 2012 డిసెంబర్ 20న భారతీయ అంబేద్కర్ సేన ఆవిర్భవించిందని పేర్కొన్నారు. దేశానికి జాతీయగీతాన్ని అందించిన మదనపల్లెలో పురుడు పోసుకున్న భారతీయ అంబేద్కర్ సేన అంచెలంచెలుగా ఎదిగి, ఆరు రాష్ట్రాలకు విస్తరించిందని పేర్కొన్నారు. భారతీయ అంబేద్కర్ సేన పదమూడేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకొని, పద్నాలుగో వసంతంలోకు ప్రవేశిస్తున్న సందర్భంగా బాస్ ఉద్యమ శ్రేణులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేసి, భవిష్యత్ పోరాటాలకూ ఇదేవిధంగా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ సభ్యుడు కె.వి.రమణ, రాష్ట్ర అధ్యక్షుడు యు.గణపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.దొరస్వామి, కోశాధికారి నీరుగట్టి రమణ, అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, బాస్ స్థానిక నాయకులు జి.వి.రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, వై.గంగాధర్, తలారి కృష్ణ, క్రాంతి, జి.గంగులప్ప, శశిధర్, ఇర్ఫాన్, రెడ్డిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో గురుప్రసాద్

యూత్ ఫెస్టివల్‌లో జ్ఞానాంబిక విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె

రాయచోటిలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో స్థానిక శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. లంబాడ డాన్స్‌లో ప్రథమ స్థానం, జానపద గీతం (గ్రూప్ సాంగ్)లో ప్రథమ స్థానం, జానపద నృత్యంలో ద్వితీయ స్థానం దక్కించుకున్నాయని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. మొదటి స్థానాన్ని గెలుపొందిన విద్యార్థినులు స్టేట్ లెవెల్‌కు ఎంపికయ్యారన్నారు. విజయవాడలో జరుగు యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు యూత్ ఫెస్టివల్‌లో గెలుపొందిన విద్యార్థినులను ప్రిన్సిపల్ రమాదేవి డాన్స్ మాస్టర్ సురేష్, కీబోర్డ్ ప్లేయర్ మురళి, హరి అభినందించారు.

మాతృత్వ వరం.. దత్తతతో మార్గం

ప్రజాశక్తి-పీలేరు

మాతృత్వం ఒక వరమని దత్తత అందుకు మరో మార్గమని ఎంఇఒ-2 పద్మావతి తెలిపారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల, బాలికల సంరక్షణలో భాగంగా అన్నమయ్య జిల్లా, శిశుగృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పిల్లల్లేని వారు పిల్లల్ని దత్తత తీసుకోడానికి అవసరమైన పత్రాలు, అనాథపిల్లలు, వదిలివేయబడిన పిల్లలు, అప్పగించబడిన పిల్లల రక్షణ, సంరక్షణ, పిల్లలు లేని దంపతుల ద్వారా పిల్లలకు ప్రేమను పంచె కుంటుంబాన్ని సమకూర్చడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. 0-18 ఏళ్ళ పిల్లల్ని ఎవరైనా అనధికార దత్తత తీసుకున్నట్లయితే వారి గురించి సమాచారం 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబరుకి సమాచారం ఇవ్వచ్చని, సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపిడిఒ శివశంకర్, ఐసిడిఎస్ పీలేరు ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ, తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, డిప్యూటీ హెచ్‌ఎస్‌ఒ కొండయ్య, దత్తత విభాగం నుండి మేనేజర్ ఆర్.సుప్రియ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కాయమ్మ, ఉమ, సోషల్ వర్కర్ డి.లావణ్య, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశ, కార్యకర్తలు



మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ శివరామ్‌రాయల్

అందుబాటులోకి నిమ్మనపల్లి మార్కెట్ యార్డు

- చైర్మన్ జంగాల శివరామ్‌రాయల్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డ్ భవనాన్ని స్థలాన్ని రైతులకు అందుబాటులోకి తెస్తామని మదనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ జంగాల శివరామ్‌రాయల్ అన్నారు. గురువారం నిమ్మనపల్లి మండలంలో ఆయన పర్యటిస్తూ మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. గతంలో నిమ్మనపల్లె మార్కెట్ రైతులతో కళకళలాడుతూ ఉండేది, నేడు అటువంటి మార్కెట్ లో రైతులు లేక విలవిలలాడుతున్నారని ఆవేదన చెందారు. గత ప్రభుత్వం ఈ మార్కెట్ యార్డును నిర్వీర్యం చేసిందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను ఇక్కడ ఏర్పాటు చేసి, టమోటా, వేరుశెనగ, వరి వంటి దిగుబడులను ఇక్కడే రైతులు విక్రయించుకునేలా నిమ్మనపల్లి మార్కెట్ యార్డ్ కు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రైతులు పండించిన పంటలను స్థానికంగా విక్రయించుకున్నప్పుడే వారికి ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. మదనపల్లె నిమ్మనపల్లి రామసముద్రం మండలాలలోని రైతులకు గిట్టుబాటు ధరలను మార్కెట్లో కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా మార్కెట్లో రైతులను వ్యాపారస్తులు ఇబ్బందులు పెడుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులను ఇబ్బందులు పెడుతూ, రైతు పంటను దోపిడీ చేసే వ్యాపారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మదనపల్లి మార్కెట్ యార్డులో రైతులకు విశ్రాంతి భవనాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భాసింఖాన్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిఆర్ఎం

ప్రజాశక్తి - నందలూరు

నందలూరు రైల్వే కేంద్రాన్ని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రైల్వే స్టేషన్, ట్రిప్‌లైన్ కార్యాలయం, పార్కు, ఇన్సిట్యూట్, జిమ్, రీడింగ్ రూమ్ లను పరిశీలించారు. ఆర్యవైశ్య సంఘ నేతలు ఎంబలూరు నరసింహస్వామి, మేడా వెంకటకుమార్, గిలివి శివశంకర్, వల్లకొండు శివకుమార, నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కమల్ బాష డిఆర్ఎంను కలిసి హైదరాబాద్, చెన్నై వెళ్లే రైళ్లకు నందలూరులో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన డిఆర్ఎం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. డిఆర్ఎం వెంట డిసిఎం (సౌత్) సుదర్శన్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఆర్పిఎఫ్ ఎస్ఐ త్రివేణి, సిఎల్ఐ పెంచలయ్య, సిసిసి విశ్వనాథ్, చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ రవిశంకర్ పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవానికి కడప మాజీ మేయర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని టంగుటూరు గ్రామ పం చాయతీలోని హజరత్ ఖాదర్‌వల్లీ సాహెబ్ 469వ ఉరుసు మహో త్సవానికి అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి పరిశీలకులు, కడప మాజీ మేయర్ సురేష్‌బాబును ఆహ్వానించినట్లు కమిటీ నిర్వాహకులు షేక్ షావలి తెలిపారు. ఈ నెల 30 గంధం, డిసెంబర్ 1ఉరుసు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సురేష్‌బాబును కలిసిన వారిలో టంగుటూరు ముస్లిం కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ నిజాముద్దీన్, ముస్లిం కమిటీ మాజీ ప్రెసిడెంట్ ఎస్.కె షావలి,ముస్లిం కమిటీ సెక్రటరీ షేక్ ఖాదర్‌బాష, ఆర్గనైజర్ షేక్ షామీర్‌బాష, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

నేడు టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రాఘవరాజుపురం టిడిపి కార్యాలయంలో శు క్రవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జ్, కడప రైల్వే ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియో జకవర్గంలోని ప్రజల సమస్యలను ప్రజాదర్బార్‌లో తన దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లోపాలను సవరించుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పివిజి పల్లి గ్రామపంచాయతీ జడ్‌పి హైస్కూ ల్‌లో మైస్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పుల్లంపేట ఎంఇఓ-2 కుమారి పి.జయశ్రీ సందర్శించారు. 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. లోపాలను సవరించుకొని బోధన సాగించాలని సూచించారు. ఉపాధ్యాయులు లోపాలను అధిగమించి నాణ్యమైన బోధనను అందించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హేమలత

ప్రజాశక్తి-తంబళ్లపల్లె: ఈనెల 7నుంచి మదనపల్లె జడ్‌పి హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపికల్లో కన్నెమడుగు జడ్‌పి హైస్కూల్‌లో 8 వతరగతి చదువుతున్న హేమలత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నాగరాజు తెలిపారు. ఈనెల 20, 21న మదనపల్లె గ్రీన్ వాల్లీ స్కూల్లో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. హేమలతను హెచ్ఎం, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అభినందించారు.

పేదలకు వరం సిఎం సహాయనిధి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట



బాధితులకు చెక్కులు అందిస్తున్న చమర్తి

సిఎం సహాయ నిధి పేదలకు వరమని రాజంపేట నియోజ కవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు పేర్కొన్నారు. గురు వారం టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. మేడా అంకమ్మ కు రూ.76,736, నర్సాపురం యానాదయ్యకు రూ.56,441, ఆవుల లక్ష్మీదేవి రూ.13,350, షేక్ పార్వీజాన్ కు రూ 1,43,502, దేరంగుల లక్ష్మీదేవి రూ 41,400, తప్పెన రామయ్య కు రూ 11వేలు అందించినట్లు తెలిపారు. షేక్ రహమత్ బీ రూ.29,162, డి.రెహమాన్ ఇషాక్ రూ 76,358, కందుకూరి శ్రీనివాసాచారి రూ.27,219, చెలమేమహేశ్వర్‌కు రూ.35వేలు, కాలూరి అమీరాబాష రూ.85వేలు, అక్క రాజు పార్థసారధి కి రూ.18వేలు, వెలిగండ్ల నాగమణికి రూ.66,935, బండారు కృష్ణయ్యకు రూ.80వేలు, మాస సావిత్రమ్మకు రూ.25వేలు, ఎద్దేని శ్రీరాములుకు రూ.1,00,567, సోమర్ మల్లేశమ్మకు రూ. 81వేలు, లక్ష్మీపతి నాగలక్ష్మికి రూ.25వేలు, భీమిరెడ్డి ఆదిలక్ష్మికి రూ. 1,50,843, నాగలపాటి శంకరమ్మకు రూ.25వేలు చొప్పున మొత్తం రూ 11,67,513 ల చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, యూనిట్ ఇన్‌ఛార్జి తెలాల సందీప్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు రాంనగర్ నరసింహ, పాండురాజు, సిద్దవటం నాగ మునిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి దగ్గుపాటి వెంకటేశ్వర్లు, దాసరి కాళ్లర్, ఎస్.సురేందర్ నాయుడు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం



తంబళ్లపల్లి : ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-కలకడ

గ్రంథాలయ వారోత్సవాలకు ముగింపు కార్యక్రమం నిర్వహించినట్లు కలకడ గ్రంథాలయశాఖ అధికారి అమరనాథ తెలిపారు. స్థానిక బాటవారపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో ప్రధా నోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.వారోత్సవాల్లో భాగంగా గత వారంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, ముగ్గులు పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు,బహుమతులను ప్రధానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయ శాఖ గ్రంథాలయానికి పుస్తకాలను వితరణ చేసినట్లు తెలుగు పండితులు, అష్టావధాని లోక జగన్నాథ శాస్త్రి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగులో ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గ్రంథాల యానికి ఉపయోగకరంగా ఉండేలా కొన్ని పుస్తకాలను వితరణగా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను బలోపేతం చేయాలని గ్రంథాల యోద్యమపితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు లాంటి మహనీయులు కృషి కారణంగా ఈరోజు ఊరూర గ్రంథాలయాలువెలిశాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అమరనాథ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు చక్కని వేదికలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మునిగోపాలకృష్ణ పేర్కొన్నారు. మదనపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి ఆర్.వసంతకుమారి ఆధ్వర్యంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ, డాక్టర్ వై.ఎస్ మునిరత్నం, మరసం ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి, బ్యాంక్ ఆఫ్ బరోడా అసిస్టెంట్ మేనేజర్ కోటిరెడ్డి, ప్రముఖ మోటివేటర్ స్పెషలిస్ట్ రామ్మూర్తి, హరినాథ్ రెడ్డి, ప్రముఖ కవయిత్రి సురభి హేమలత, విశ్వహిత డిగ్రీ కళాశాల అధ్యాపకులు ముస్తాక్, విశ్రాంత ఉపాధ్యాయుడు రెడ్డెప్ప, జగన్మోహన్, హరినాథ్ రెడ్డి, రాఘవేంద్రలు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవచ్చునని, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందించడంతోపాటు మేధస్సును పెంచుకోవడానికి గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు .గ్రంథాలయాలలో అందుబాటులో ఉండే వార్తపత్రికలు, మాసపత్రికలు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, గ్రంథాలు, నవలలు, చదువడం ద్వారా ఎంతో పరిణీతి సాధించవచ్చునన్నారు. వారం రోజుల పాటు జరిగిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుమతులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.**బి.కొత్తకోట :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కురబలకోట మండలంలో గల శాఖ గ్రంథాలయంలో ఘనంగా ముగిశాయి.స్థానిక శాఖ గ్రంథాలయం అధికారి బి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఎంపిడిఒ గంగయ్య, ఎంఇఒ ద్వారకనాథ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వంలోని ప్రతి అంశంలో జ్ఞానం,విజ్ఞానం పెంచుకోవడానికి ఉపయోగపడే నేస్తాలు పుస్తకాలన్నారు.అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు,మహిళా సాధికారత చర్చ పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బి.కొత్తకోట గ్రంథాలయం నందు ఎంఇఒ రెడ్డి శేఖర్, ఉపాధ్యాయులు భాస్కర, గ్రంథాలయ అధికారి ప్రమీల చేతులమీదుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు.**తంబళ్లపల్లి:** జాతీయ గ్రంథాలయ వారోత్సావాల భాగంగా విద్యార్థులకు వ్యాపరచన, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, ఎంఇఒ-2 సుబ్బరాయుడు విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెడ్డెప్ప రెడ్డి, పద్మావతి, సుగుణను, సాజిదా బేగం, సేనియం గౌసియా,గ్రంథాలయ అధికారి పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని స్థానిక గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాల్లో గెలుపొందిన పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, స్వతంత భారతి ఇంగ్లీష్ మీడి యం స్కూల్ విద్యార్థులకు బహుమతులు, ప్రసంశాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసుంధర, రాధ, శైలజ, పురుషోత్తం, ఎస్ఎం ఖాన్, భరత్, ఖాదర్ బాష పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్:** మేథోశక్తిని పెంపొందించే కేంద్రాలు గ్రంథాలయాలని రాయచోటి గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాల యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జరిగింది. వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల విజేతలకు బహుమ తులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ గ్రంథాల యాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారలని జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి గ్రంథలయాలను వినియోగించుకొని భవిష్యత్తుకు నిర్దేశించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎంపిడిఒ భానుమూర్తి రావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మహమ్మద్ రియాజుద్దీన్, కలికిరి టౌన్ డెవలప్మెంట్ చైర్మన్ యోగేశ్వర్‌రెడ్డి, ప్రముఖ కవి డాక్టర్ వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ హాజరయ్యారు. కలికిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ యోగేశ్వర్ మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. సెంట్రల్ లైబ్రరీ గుంటూరు నందు నిర్మాణానికి 100 కోట్ల రూపాయలను విరాళాలుగా సేకరించాలని గుర్తు చేశాంకార్యక్రమానికి సి.కామ్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉపాధ్యాయులు, పాఠకులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకు టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలి

- మాజీ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి అఫూ మోహిద్దీన్

ప్రజాశక్తి-కలికిరి



ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కెఎస్.అఫూ మొహిద్దిన్

స్థానికులకు టోల్ ఫీజ్‌లో మినహాయింపు ఇవ్వాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు మాజీ ట్రాన్స్‌పోర్ట్ అసిస్టెంట్ కమిషనర్ కేఎస్ ఆఫూ మోహిద్దీన్ వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం 20 కిలోమీటర్ల పరిధిలోని స్థానికులకు ప్రకటించిన టోల్ ఫీ మినహాయింపును అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హైవేలలో స్థానికుల వాహనాలకు 20కిలోమీటర్లు వరకు టోల్ ప్లాజాల వద్ద ఆధార్ కార్డు చూపిస్తే టోల్ ఫీజు మినహాయించాలని జిఒ ఇచ్చిందని తెలిపారు. గత ఏడాది క్రితం పార్లమెంటు సమావేశాల్లో మంత్రి 60కిలోమీటర్ల పరిధిలో ఉన్న టోల్ ప్లాజా వద్ద స్థానికులకు టోల్ ఫీ మినహాయించాలని తెలిపారన్నారు. కనీసం 20 కిలోమీటర్లు పరిధిలోని వారికి కూడా ఇది ఎక్కడ అమలు కాలేదని, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, గండబోయినపల్లి, పీలేరు వద్ద గల టోల్ ప్లాజాలలో స్థానికులు ఆదార్‌కార్డు చూపించినా తిరస్కరిస్తున్నారని తెలిపారు. స్థానికులు పదే పదే ఇతర గ్రామాలకు తమ వాహనాల్లో వెళ్లాలంటే భారీగా టోల్ రుసుం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం సూచించిన విధంగా నెలవారి కార్డులు కానీ, ఏడాదికి ఇచ్చే కార్డులు కావాలన్నా నెలకు 20 కార్డులకు మించి గండబోయినపల్లి టోల్ ప్లాజా వద్ద ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవి కూడా వారికి ఇష్టం వచ్చిన వారికి ఇస్తున్నారని ఏమి చేయలేక కొందరు స్థానికులు టోల్ ఫీ చెల్లించి వెళుతు న్నామని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడ లేని విధంగా గండబోయినపల్లి టోల్ ప్లాజాలో టోల్ ఫీ అధికంగా ఉందని,తగ్గించి సామాన్యుల పైన భారం పడకుండా చూడాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సయ్యద్ అహ్మద్‌కు ఆఫూమోహిద్దీన్ వినతి పత్రం సమర్పించారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెలతామని తెలిపారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు : ఎంపిడిఒ



కలకడ :శిక్షణా కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపిడిఒ భానుప్రసాద్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పంచాయతీలలో మెరుగైన పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపిడిఒ అబ్దుల్‌షకూర్ పేర్కొన్నారు .గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఎస్‌డిజి, థీములు-5, క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్, ఆర్‌జిఎస్ఎ యానివల్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పంచాయతీ అభివృద్ధి అధికారులు (పంచాయతీ కార్యదర్శులు) సర్పంచులు, ఉప సర్పంచులతో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. పారిశుధ్యంపై వివిధ అంశాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పంచాయతీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలన్నారు. తాగునీటి కొరత లేకుండా చూడలన్నారు. ఇందుకు కోసం ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించవలసిన పారిశుధ్య పనులపై ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ భాను ప్రసాద్ తెలిపారు.గురువారం మండల కేంద్రంలోని కలకడ మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 16 పంచాయితీలలో ఉన్న గ్రామాలలో పారిశుధ్య పనులు, వీధి దీపాలు, సిసి రోడ్లు, నీటి ట్యాంకులు శుభ్రత, తదితర అంశాల నిర్వహణపై సూచనా తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్, ఆర్‌జిఎస్ఎ వార్షిక ప్రణాళికలో భాగంగా పంచాయతీల అభివృద్ధికి అధికారులు, సర్పంచులు కష్టపడి పనిచేసే మండలాన్ని అభివృద్ధి దిశలో పయనింపచేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలికిరి

జాతీయ సేవా పథకం కింద వారం రోజులు పాటు శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎస్ వి వ్యవసాయ కళాశాల విద్యార్థులు 4 వ రోజులో భాగంగా మేడికుర్తి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు రక్త పరీక్షలు, చక్కర వ్యాధి పరీక్షలు, బిపి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మోకాళ్ళ నొప్పి, నడుం నొప్పి, పిల్లలకు జ్వరం, దగ్గు, చెవి నొప్పి ,గొంతు నొప్పి, తలనొప్పి మొదలైన రుగ్మతలకు మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు అందించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కావ్య, మండల సూపర్వైజర్ సుధాకర్ ః, మల్టీపర్పస్ హెల్త్ సూపర్వైజర్ గిరిజమ్మ, మైల్డ్ లెవెల్ హెల్త్ కేర్ ప్రొవైడర్ పావని, మల్టీపర్పస్ హెల్త్ కేర్ అసిస్టెంట్ సరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశు గర్భకోశ వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని రేణిమాకులపల్లె గ్రామం దండువారిపల్లెలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడి పశువుల గర్భ కోశ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భ కోశ వ్యాధుల చికిత్సలో నిష్టాతులైన సహాయ సంచాలకులు డాక్టర్ కల్యాణ్ వెంకటేష్ 36పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేశారు. 95 పశువులకు బ్యుటాక్స్ పిచికారి, 46 దూడలకు నట్టాల నివారణ మందులు తాపించారు. గర్భ కోశ వ్యాధుల పట్ల పాడి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తంబల్లపల్లె ఎడి డాక్టర్ సుమిత్ర, డాక్టర్ ఇందు, జెవిఒలు శ్రీనాథ్, హేమపతిరెడ్డి, పశు వైద్య సహాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శిరీష, దేవేంద్ర, పూర్ణిమ, నాగార్జున పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి : రోగులు యాంటీ బయాటిక్ మాత్రలు వాడకంపై తగు జాగ్రత్తలు వహించాలని మహల్ సిహెచ్‌సి వైద్యులు అష్రాఫ్ తెలిపారు. ప్రపంచ ఎఎంఆర్ అవగాహన వారోత్సవాలు సందర్భంగా మండలంలోని మహల్ సిహెచ్‌సి వైద్యులు ఆధ్వర్యంలో రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి చిన్న చిన్న రోగాలకు యాంటిబయాటిక్స్ మాత్రలు వాడటం వలన మన రోగ నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. కొంతమంది రోగులు వ్యాధులు తొందరగా తగ్గిపోతాయని నెపంతో అవగాహన లేక మందుల షాపులు వద్ద ఎక్కువగా యాంటీ బయోటిక్ మాత్రలు వాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ఫార్మసిస్టు సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు అర్హులను గుర్తించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మంజూరు చేయనున్న పక్కా గృహాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అన్నమయ్య జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ కంభం రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మదనపల్లె హౌసింగ్ డిఇఇ దీన్‌దయ్యాల్‌రాజుతో కలసి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్కా గృహాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి చేత దరఖాస్తు ప్రక్రియను ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేయించాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజా ప్రతినిధులతో, కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి సొంత స్థలం ఉండి పక్క గృహాలకు అర్హులైన లబ్ధిదారులను, స్థలం లేని అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి : పీడీ

ప్రజాశక్తి-రామాపురం

మండలం జరుగుతున్న ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీంచి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ చేసిన పనికి తగ్గట్టుగా గిట్టు బాటు డబ్బులు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డ్ పొం దిన ప్రతి వ్యక్తి ఉపాధి హామీ పనులకు హాజరయ్యే విధంగా చూడాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ ఎపిఒ పెంచలయ్య, టెక్నికల్ అసిస్టెంట్ కళావతి, గ్రామ ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, ఎఫ్ఎ పెంచల్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు రియాజ్ పీర్ భాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - నందలూరు : ఏకలవ్య ఫౌండేషన్ రాజంపేటశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన ఫౌండేషన్ రాజంపేట కో-ఆర్డినేటర్ నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఈ పోటీలను నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, తపాలా కార్యాలయాలు - ప్రజలకు అందిస్తున్న సేవలు అనే అంశాలపై సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు రెండు విభాగాలుగా ప్రాజెక్టు వర్క్స్ నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో కార్తీక్, మోహనకృష్ణ, హర్షిణీ, జూనియర్స్ విభాగంలో భవ్య శ్రీ, అఖిల, ప్రణీత్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజాల, విజయకుమారి, గౌరీ, మస్తాన్, గొంటుముక్కల వెంకటరమణ, సంపత్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బెస్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన సాహితీ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు



సాహితిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

పట్టణంలోని ఎస్‌వి జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం బైపిసి చదువుతున్న విద్యార్థిని యు.సాహితి రాష్ట్ర బేస్ బాల్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మూడు రోజులపాటు రైల్వే కోడూరు గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సాహితి జనవరి మొదటి వారం ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన సాహితీని డైరెక్టర్ ఎస్ వసుంధర, ఫిజికల్ డైరెక్టర్ పిటి పుల్లారావు అభినందించారు.

కూరగాయలతో వినూత్న బోధన

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని దలవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యా యునిగా పనిచేస్తున్న రమణ ఒకటవ తరగతి విద్యార్థులకు కూరగాయలు అనే చిన్న పాటను వివిధ సబ్జెక్టులకు అన్వయించి కృత్యాధార, ప్రత్యక్ష అనుభవం ద్వారా, ఆనందదాయక అభ్యసన వాతావరణంలో విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ కూరగాయలు ఉపయోగించి కేవలం వాటి పేర్లను మాత్రమే నేర్పించడం జరుగుతుందని కానీ అలా కాకుండా వాటి కలర్లు, వాటి ఆకారాలు, ఆరోగ్య, అనారోగ్య ఆహారం, ఏక వచన, బహువచన పదాలు, అంకెలు, లెక్కించడం, కూడడం, తీసివేయడం, ఆరోహణ, అవరోహణ క్రమం, దత్తాంశ సేకరణ వంటి ఎన్నో అంశాలు పిల్లలకు నేర్పించ వచ్చని తెలియజేశారు. ప్రత్యక్ష పరిశీలన ద్వారా పిల్లలు సులభంగా విద్యను నేర్చుకోవడం జరుగుతుందని ఎప్పటికీ గుర్తుండిపోతాయని తెలిపారు.


మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం మైసూరివారి పల్లెకు చెందిన లక్కాకుల రమాదేవి అనే మహిళ ఈ 14వ తేదీ నుంచి కనబడడం లేదని భర్త లక్కాకుల నాగమణి తెలిపారు. గత రెండు సంవత్సరాల పైగా మతిస్థిమితం లేక ఆసుపత్రిలో కూడా తిరగామని, ఫలితం లేదని ఈ మేరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని భర్త తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే ఈ నంబర్లకు 9133011204, ఫోన్ చేసి తెలుపవలసిందిగా భర్త నాగమణి కోరారు.

రైతులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి నిమ్మనపల్లె

రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే షాజ హాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం మదనపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ జంగాల శివరాం రాయల్ తో కలసి నిమ్మనపల్లి మండలంలో పర్యటించారు. స్థానిక కూటమి నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని తవళం క్రాస్ కూడలి వద్ద ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో రైతులు సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా అతి తక్కువ ధరకే రైతులకు అవసరమైన ఎరువులను విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు వరి కోత దశలో ఉన్నారని, త్వరలోనే వరి పంటను సాగు చేయడానికి వరినారు పోయాల్సి ఉందన్నారు. ఈ కేంద్రం ఆర్ఎన్ఆర్ వంటి వరి నారు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 25కేజీల బస్తా కేవలం రూ.1150లకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇదే విత్తనాలు బయట దుకాణాల్లో కొనాలంటే దాదాపు రూ.1800లు వెచ్చించి కొనుక్కోవాల్సి ఉంటుందని, ఇక్కడ కేజీ పై రూ.20లు తక్కువగా అమ్ముతున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ కేంద్రాలను మదనపల్లె, నిమ్మనపల్లె ప్రాంతాలలో కూడా విస్తరించడానికి సహకరిస్తున్నట్లు తెలిపారు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న రైతుల భూ ముల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని తెలిపారు. అనంతరం మోడల్ హైస్కూల్‌ను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిం చాలని, పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, ఆర్ జే వెంకటేష్, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, సుధాకర, సుధాకరరావు, శ్రీపతి, మల్లప్ప, జగ దీష్, ఎపి మాస్ సిఇఒ స్వరూప రాణి, డైరెక్టర్లు శంకర రెడ్డి, వాసుదేవ రెడ్డి, ప్రభా కర్‌రెడ్డి, భాస్కర్ఃరెడ్డి, సుమిత్రమ్మ, లక్ష్మీదేవి, సిబ్బంది జ్యోతి, షాజియా ఖానం, తహశీల్దార్ తపస్విని, ఎఒ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎంఇఒ పద్మావతి, ప్రిన్సిపల్ ప్రియదర్శిని,ఎపిఎం మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా